మళ్లీ కుర్చీలాట!

కర్ణాటక కాంగ్రెస్‌లో లుకలుకలు

- జోరందుకున్న అసమ్మతి సెగలు
- సీఎంను గద్దె దింపేందుకు అప్పుడే క్యాంపు రాజకీయాలు
- కాంగ్రెస్ కల్చర్ ఎప్పటికీ మారదని ప్రజల ఈసడింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): చింత చచ్చినా పులుపు చావదన్నట్టు కాంగ్రెస్ సంస్కృతిలో వీసమెత్తు మార్పు కనిపించడం లేదు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అయినా గడువక ముందే అసమ్మతి రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలు పెచ్చుమీరాయి. సీఎం సీట్లో రెండో కృష్ణుడ్ని కూర్చబెట్టే ప్రయత్నాలు జోరందుకున్నాయి. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏమి జరిగిందో తెలిసినప్పటికీ.. మారకపోతుందా అని నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కడితే.. మళ్లీ పాత కల్చరే పునరావృతం కావడం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. కర్ణాటక పరిస్థితి ఇలా ఉంటే, తాము కర్ణాటక మాదిరిగా తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ఆ పార్టీ ప్రచారం చేయడం పట్ల ఇక్కడి ప్రజలు విస్తుపోతున్నారు. కాంగ్రెస్‌కు పట్టం కడితే అక్కడ ఏమి జరుగుతుందో తెలంగాణలో కూడా అదే పరిస్థితి రాదన్న గ్యారెంటీ ఏముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సీఎం సిద్ధరామయ్యను గద్దె దింపడానికే స్వయంగా ఆయన మంత్రివర్గ సహచరులే పావులు కదపడంతో కర్ణాటక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

20 మంది ఎమ్మెల్యేలతో క్యాంప్

సీఎం సిద్ధరామయ్యను గద్దె దింపేందుకు మంత్రి సతీశ్ జార్ఖిహోళి నేతృత్వంలో 20 మంది ఎమ్మెల్యేలతో క్యాంప్ ఏర్పాటుచేసినట్టు సమాచారం బయటికి పొక్కడంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగింది. కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా హుటాహుటిగా బెంగళూరుకు చేరుకొని మంత్రి జార్ఖిహోళితో చర్చలు జరిపినట్టు ఈ వర్గాల సమాచారం. పక్క రాష్ట్రం తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న క్రమంలో అక్కడ పార్టీ పరువు పోతుందని నచ్చజెప్పినట్టు తెలిసింది.

హింట్ ఇచ్చింది అధిష్ఠానమే

కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్యను లోక్‌సభ ఎన్నికల వరకే కొనసాగించి ఆ తర్వాత మార్చుతామని కాంగ్రెస్ అధిష్ఠానం హింట్ ఇవ్వడమే క్యాంప్ రాజకీయాలకు కారణమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కర్ణాటకలో పార్టీ అధికారంలోకి రావడానికి డీకే శివకుమార్, సిద్ధరామయ్య పోటాపోటీగా కృషి చేశారు. వీరిలో సీఎం పోస్టు ఎవరికి ఇవ్వాలన్న సంశయం ఏర్పడినప్పుడు చెరో రెండున్నర ఏండ్లు సీఎం పదవిలో కొనసాగేలా రాజీ ఫార్ములాను అధిష్ఠానం కుదిర్చినట్టు ప్రచారం జరిగింది. ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య స్థానంలో రెండో కృష్ణుడు డీకే శివకుమార్ గద్దె నెక్కుతారన్న సమాచారంతో కర్ణాటక కాంగ్రెస్, ప్రభుత్వం ఇప్పటికే స్పష్టంగా రెండు గ్రూపులుగా విడిపోయింది. దీంతో అప్రమత్తం అయిన సిద్ధరామయ్య తన సన్నిహిత మంత్రులతో పూర్తి కాలం సీఎంగా సిద్ధరామయ్యనే కొనసాగుతారనే ప్రకటనలు కూడా చేయించారు. దక్షిణాదిలో ఏకైక రాష్ట్రం కర్ణాటకలో అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన డీకేతోనే కాంగ్రెస్ పెద్దలు టచ్‌లో ఉండటం వల్ల కాబోయే సీఎం డీకేనే అన్న ప్రచారం జరుగుతున్నది. ఇది పార్టీలో అటు సిద్ధరామయ్య, ఇటు డీకే వర్గాలకు దూరంగా ఉండే మరో వర్గం తాము ఎందుకు సీఎం కావద్దనే ఆలోచనలతో క్యాంప్ రాజకీయాలు మొదలెట్టినట్టు చెబుతున్నారు.

డీకే పర్యటనకు మంత్రులు దూరం

డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పర్యటనకు ఇద్దరు మంత్రులు దూరంగా ఉండడం ఆ పార్టీలో అంతర్గత కుమ్ములాటలకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇటీవల బెళగావి జిల్లా పర్యటనకు వెళ్లిన డీకే శివకుమార్ కార్యక్రమానికి మంత్రులు సతీశ్ జార్ఖిహోళి, లక్ష్మీ హెబ్బాళ్కర్ దూరంగా ఉన్నారు. వీరిద్దరూ సీఎం సిద్ధరామయ్యకు సన్నిహితులుగా ముద్ర పడ్డారు. పార్టీలో కొందరు ఎమ్మెల్యేలను కొందరు వ్యక్తులు ప్రలోభ పెట్టి తమ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నారని డీకే శివకుమార్ ఈ సందర్భంగా ఆరోపించారు. సీఎంగా సిద్ధరామయ్యను గద్దె దింపడానికి డీకేనే కుట్రలు పన్నుతూ మరోవైపు తమ ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు జరుగుతున్నట్టు ఆయనే ప్రచారం చేస్తున్నారని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. సీఎం సీట్లో సిద్ధరామయ్యనే కొనసాగేది కొద్ది కాలమేనని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా, పూర్తి కాలం కొనసాగుతారని సిద్ధరామయ్య వర్గం కౌంటర్ ఇస్తున్నది. తాజాగా తానెందుకు సీఎం కావద్దనే ఆలోచనతో ఎమ్మెల్యేలతో జార్ఖిహోళి క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టినట్టు సమాచారం.

డ్రగ్ రాకెట్‌లో మహారాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

ముంబై, అక్టోబర్ 20: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ లక్ష్యంగా శివసేన (యూబీటీ) నేత, ఎంపీ సంజయ్ రౌత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనకు అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌తో సంబంధాలు ఉన్నాయని విమర్శించారు. ఇటీవల నాసిక్‌లో భారీ డ్రగ్ రాకెట్ బయటపడిన క్రమంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. నాసిక్ డ్రగ్ సిండికేట్ ఉదంతంలో మహారాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల పాత్ర కూడా ఉందని, డ్రగ్ రాకెటర్ల నుంచి వారికి ప్రతి నెలా లక్షలాది రూపాయలు 'హఫ్తా' తీసుకుంటున్నారని, వారి లిస్టు తన వద్ద ఉందంటూ వెల్లడించారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

ముంబై, అక్టోబర్ 20: వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికల్లో తాను ఏ నియోజక వర్గం నుంచి పోటీ చేయనని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేయడానికి పార్టీ కార్యకర్తలతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పోటీ చేయాలంటూ పార్టీ వర్గాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని, అయితే తాను 2009 ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గిన సోలాపూర్ జిల్లా మధ నియోజకవర్గమే కాదు దేని నుంచి కూడా బరిలోకి దిగనని తెలిపారు.

జమిలి ఎన్నికలపై రోడ్‌మ్యాప్

25న కోవింద్ కమిటీకి సమర్పించనున్న లా కమిషన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో వచ్చే వారం లా కమిషన్ భేటీ కానుంది. ఈ నెల 25న జమిలి ఎన్నికలకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను కమిటీకి సమర్పించనుంది. పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపాల్టీ తదితర ఎన్నికలను దేశంలో ఏకకాలంలో నిర్వహించేందుకు గల సాధ్యాసాధ్యాల పరిశీలన నిమిత్తం రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటైన విషయం తెలిసిందే. జమిలి ఎన్నికలపై అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలంటూ ఈ నెల 25న జరిగే సమావేశానికి లా కమిషన్‌ను కమిటీ ఆహ్వానించింది.

పాండ్యనే మా సీఎం

ఒడిశా ఎమ్మెల్యే వ్యాఖ్యలు

భువనేశ్వర్: ఒడిశా ఎమ్మెల్యే, బిజూ జనతా దళ్ (బీజేడీ) నేత దేబి ప్రసాద్ మిశ్రా తన వ్యాఖ్యలతో గందరగోళం సృష్టించారు. 5టీ పథకానికి కార్యదర్శిగా ఉన్న వీకే పాండ్యనే తమ సీఎం అంటూ రాజకీయ వర్గాలను విస్మయానికి గురి చేశారు. కటక్‌లో ముఖ్యమంత్రి వర్చువల్‌గా ఒక పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. మే 31న బీజేడీ ఎంపీ పరిమళ బిసోయి కూడా పాండ్యన్ గురించి ఒక బహిరంగ సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. కాగా, దీనిపై శుక్రవారం ఎమ్మెల్యే దేబి ప్రసాద్ మిశ్రా యూ టర్న్ తీసుకున్నారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని అన్నారు.

రాజస్థాన్‌లోనూ విపక్ష కూటమిలో చిచ్చు

తమకు 6 సీట్లు కేటాయించాలని ఆర్ఎల్డీ డిమాండ్

ఆర్ఎల్డీ చీఫ్ జయంత్

లక్నో, అక్టోబర్ 20: విపక్ష 'ఇండియా' కూటమి పార్టీల నుంచి కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పులు ప్రారంభమయ్యాయి. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తు ధర్మాన్ని పాటించడం లేదని, తమకు కేటాయించాల్సిన సీట్ల గురించి పట్టించుకోకుండా ఏకపక్షంగా తమ అభ్యర్థులను ప్రకటించిందని గురువారం సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇప్పుడు తాజాగా కూటమిలోని మరో భాగస్వామ్య పార్టీ అయిన రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్డీ) రాజస్థాన్‌లో కాంగ్రెస్ వైఖరిపై మండిపడుతున్నది. రాజస్థాన్‌లో కనీసం ఆరు సీట్లను తమకు కేటాయించాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నది. ఆర్ఎల్డీ పార్టీ 2018 రాజస్థాన్ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసింది. భరత్‌పూర్, మల్‌పూర్‌లో పోటీచేసిన ఈ పార్టీ భరత్‌పూర్‌లో విజయం సాధించింది. ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో భాగస్వామిగా ఉన్న ఆర్ఎల్డీ కూటమి పొత్తు కేవలం లోక్‌సభ ఎన్నికలకే పరిమితం కాదని, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పొత్తు ధర్మాన్ని పాటించాలంటూ పేర్కొంటున్నది. జాట్ల ప్రాబల్యం ఎక్కువగా జిల్లాల్లో తమకు సీట్లు కేటాయించాలంటూ డిమాండ్ చేస్తున్నది. 10 శాతం జనాభా ఉన్న జాట్లు 40 సీట్లలో ప్రభావం చూపుతారని అంచనా.

'నమో భారత్' రైలు ప్రారంభం

సాహిబాబాద్, అక్టోబర్ 20: నమోఘాట్, నమో స్టేడియం (నరేంద్రమోదీ స్టేడియం).. ఇప్పుడు నమోభారత్ రైలు.. అన్నింటికీ ప్రధాని మోదీ పేర్లు పెట్టడంపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తంచేస్తున్నాయి. దేశ మొదటి ప్రాంతీయ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ(ఆర్ఆర్‌టీఎస్)ను ప్రధాని మోదీ శుక్రవారం యూపీలోని సహిబాబాద్‌లో ప్రారంభించారు. ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌లో సాహిబాబాద్-దుహాయ్ డిపో స్టేషన్ల మధ్య నడిచే నమో భారత్ రైలును ప్రారంభించారు. ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ కారిడార్ పూర్తయితే ఢిల్లీ-మీరట్ మధ్య ప్రయాణ సమయం ఒక గంట కంటే తక్కువ కానుంది. 12-18 నెలల్లో ఈ కారిడార్ పూర్తి కానుందని ప్రధాని తెలిపారు. దేశపు ఈ మొదటి సెమీ హైస్పీడ్ ప్రాంతీయ రైలు సర్వీసుల్లో హైటెక్ ఫీచర్లు, ప్రయాణికులకు అనేక సౌకర్యాలు ఉన్నాయి. జాతీయ రాజధాని ప్రాంత రవాణా కార్పొరేషన్, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి.

బెదిరించి సంతకం చేయించారు!

హీరానందానీ అఫిడవిట్‌పై మహువా

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగటానికి ముడుపులు తీసుకున్నారని తనపై వచ్చిన ఆరోపణలపై తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా స్పందించారు. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీని ప్రధాని కార్యాలయం బెదిరించి, అఫిడవిట్‌పై సంతకం చేయించిందని ఆమె ఆరోపించారు. సీబీఐ కానీ, పార్లమెంటు ఎథిక్స్ కమిటీ కానీ ప్రశ్నిస్తే సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. హీరానందానీ గురువారం పార్లమెంటు ఎథిక్స్ కమిటీకి ఓ అఫిడవిట్‌ను సమర్పించారు. ప్రధానిపై విమర్శలు చేస్తే, తన పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతుందని మహువా భావించారని, అందుకే అదానీ గ్రూప్‌పై అనేక ప్రశ్నలు పార్లమెంటులో అడిగారని తెలిపారు. ఆమె తన పార్లమెంటు అకౌంట్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను తనకు ఇచ్చారని, తాను వాటిని ఉపయోగించుకుని ప్రశ్నలు అడగడానికి అవసరమైన సమాచారాన్ని పంపించానని తెలిపారు.

---

41 మంది కెనడా దౌత్యవేత్తలు వెనక్కి

భారత్ అల్టిమేటంతో సిబ్బందిని తగ్గించుకున్న కెనడా

అంతర్జాతీయ చట్టాలను భారత్ ఉల్లంఘించిందని ఆరోపణ

టొరంటో, న్యూఢిల్లీ, అక్టోబర్ 20: భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. భారత్‌లోని 41 మంది కెనడా దౌత్యవేత్తలకు, వారి కుటుంబాలకు ఉండే అంతర్జాతీయ దౌత్య పరమైన రక్షణలను ఉపసంహరిస్తామని భారత్ అల్టిమేటం జారీ చేసిన నేపథ్యంలో ఆ దౌత్య సిబ్బందిని ఉపసంహరించుకుంటున్నట్టు కెనడా శుక్రవారం ప్రకటించింది. చండీగఢ్, ముంబై, బెంగళూరులోని కాన్సులేట్లలో వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు తెలిపింది. భారత్‌లోని కెనడా పౌరులు అత్యంత జాగరూకతతో ఉండాలని సూచించింది. కెనడాకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరగవచ్చని హెచ్చరించింది. సంప్రదాయ, సోషల్ మీడియాలో కెనడాకు వ్యతిరేకంగా ప్రచారం జరగొచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలో కెనడియన్లు హింసకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని కోరింది. దౌత్య సంబంధాలపై వియన్నా సదస్సులో చేసిన తీర్మానాలను భారత్ అతిక్రమించిందని కెనడా విదేశాంగ మంత్రి మెలనీ జోలీ ఆరోపించారు. అయితే కెనడా ప్రకటనను భారత విదేశాంగ శాఖ ఖండించింది. అంతర్జాతీయ ప్రమాణాలను ఉల్లంఘించలేదని తెలిపింది.

సెప్టెంబర్ 30 తర్వాత చేపట్టిన ఎంబీబీఎస్ అడ్మిషన్లు చెల్లవు

- నేషనల్ మెడికల్ కౌన్సిల్ స్పష్టీకరణ
- 400 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం!

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ అడ్మిషన్లకు సంబంధించి 'నేషనల్ మెడికల్ కమిషన్' (ఎన్ఎంసీ) సంచలన నిర్ణయం తీసుకుంది. ఎంబీబీఎస్ కోర్సుల అడ్మిషన్ తుది గడువు సెప్టెంబర్ 30తో ముగిసిందని, కటాఫ్ తేదీ తర్వాత జరిగిన అడ్మిషన్లు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్ఎంసీ శుక్రవారం ఓ నోటీస్ విడుదల చేసింది. దీంతో దేశవ్యాప్తంగా 400 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వీరికి కేటాయించిన సీట్లు చెల్లుబాటు కావని ఎన్ఎంసీ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఇదిలా ఉండగా, ఎంబీబీఎస్ పాస్ మార్కులను 40శాతానికి తగ్గిస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఎన్ఎంసీ ఉపసంహరించుకుంది. ఎంబీబీఎస్ కోర్సుల అడ్మిషన్ల కటాఫ్ తేదీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలకు ఇంతకుముందే సమాచారం ఇచ్చామని ఎన్ఎంసీ పేర్కొన్నది. ఈ కటాఫ్ తేదీ తర్వాత జరిగిన అడ్మిషన్లను వెంటనే డిశ్చార్జ్ చేయాల్సిందేనని ఆదేశించింది. మరోవైపు, దేశవ్యాప్తంగా వందలాదిగా మెడికల్ సీట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ర్టాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఇంకా కొనసాగిస్తున్న సంగతి తమ దృష్టికి వచ్చిందని ఎన్ఎంసీ తెలిపింది.

నేడు గగన్‌యాన్ తొలి టెస్ట్ ఫ్లైట్ ప్రయోగం

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి శనివారం ఉదయం 8 గంటలకు గగన్‌యాన్ టెస్ట్ వెహికల్‌ను ఇస్రో ప్రయోగించనుంది. దీని ద్వారా 'క్రూ ఎస్కేప్ వ్యవస్థ' పనితీరును పరీక్షించనున్నారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా గగన్‌యాన్ మిషన్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకు సన్నాహకంగా పలు కీలక పరీక్షలను ఇస్రో చేపట్టనుంది. తొలుత క్రూ మాడ్యూల్ వ్యవస్థను పరీక్షించనున్నది. అనుకోని ప్రమాదం తలెత్తితే వ్యోమగాములు సురక్షితంగా బయటపడేలా చూసే లక్ష్యంతో ఈ పరీక్షను చేపడుతున్నారు. ఇందులో భాగంగా డీ1 రాకెట్ ద్వారా క్రూ మాడ్యూల్‌ని నింగిలోకి పంపనున్నారు. అయిదారు గంటలకి తిరిగి భూమిని చేరేలా డిజైన్ చేశారు. బంగాళాఖాతంలోకి పడేలా రూపకల్పన చేశారు.

గెలువకపోయినా ఓడిస్తాయ్!

- ఎంపీలో 30 నియోజకవర్గాల్లో చిన్నపార్టీల హవా
- కాంగ్రెస్, బీజేపీకిగుబులు
- గెలుపు మార్జిన్ కంటే వీటి ఓట్లే అధికం

భోపాల్, అక్టోబర్ 20: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చిన్నపార్టీలు కాంగ్రెస్, బీజేపీకి చెమటలు పట్టిస్తున్నాయి. పైగా ఈ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ మధ్య ద్విముఖ పోరుగానే కనిపిస్తున్నప్పటికీ, చిన్నచిన్న పార్టీలు ఎక్కడ తమ కొంప ముంచుతాయోనని ఈ పార్టీలు భయపడుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 230 స్థానాలుండగా, దాదాపు 30 సీట్లలో చిన్నపార్టీల దెబ్బకు గతంలో కాంగ్రెస్, బీజేపీ అదృష్టాలు మారిపోయాయి. దీంతో జాతీయ పార్టీలు ఈసారి చాలా జాగ్రత్తగా ఎన్నికల మేనేజ్‌మెంట్‌కు పూనుకొన్నాయి.

30 సీట్లు కీలకం

2018 ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 30 సీట్లలో గెలిచిన అభ్యర్థికి, ఓడిన అభ్యర్థి మధ్య ఓట్ల తేడా మూడు వేల లోపే ఉన్నది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 33 సీట్లలో ఇదే పరిస్థితి కనిపించింది. ఈ స్థానాల్లో గెలిచిన అభ్యర్థి మార్జిన్.. అంటే ఓడిన అభ్యర్థి కంటే సాధించిన ఎక్కువ ఓట్లకంటే మూడో స్థానంలో నిలిచిన అభ్యర్థి సాధించిన ఓట్లే అధికంగా ఉన్నాయి. గోండ్వానా గణపరిషత్ (జీజీపీ), బహుజన్ సంఘర్ష్ దళ్, బీఎస్పీ, సమాజ్‌వాదీ వంటి చిన్న పార్టీలు ఈ స్థానాల్లో ప్రధాన పార్టీల గెలుపు ఓటములను శాసిస్తున్నాయి.



కమల్‌నాథ్

చౌహాన్

> 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 3 వేలలోపు ఓట్ల తేడాతో విజయం తేలిన 33 సీట్లలో బీజేపీ 18, కాంగ్రెస్ 12, బీఎస్పీ 2, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. ఇవే 33 సీట్లలో 2018 ఎన్నికల నాటికి పార్టీల గెలుపు ఓటములు తారుమారయ్యాయి.

విజయ్‌పూర్: గత ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థిపై 2,840 ఓట్ల తేడాతో విజయం సాధించాడు. ఇక్కడ మూడోస్థానంలో నిలిచిన బీఎస్పీ ఏకంగా 35,238 ఓట్లు సాధించి కాంగ్రెస్ గెలుపు అవకాశాలకు గండి కొట్టింది.

గ్వాలియర్ రూరల్: 2018 ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ అభ్యర్థి, బీఎస్పీపై 1,517 ఓట్ల తేడాతో గెలిచాడు. దళితుల్లో ప్రాబల్యం కలిగిన బహుజన్ సంఘర్ష్ దళ్ అనే పార్టీ 7,698 ఓట్లు, ఆమ్‌ఆద్మీ పార్టీ 2,689 ఓట్లు సాధించి బీఎస్పీ గెలుపును అడ్డుకొన్నాయి.

గ్వాలియర్ సౌత్: ఇక్కడ కేవలం 121 ఓట్ల తేడాతో బీజేపీపై కాంగ్రెస్ గెలిచింది. బీజేపీ రెబల్ 30,745 ఓట్లు సాధించి ఆ పార్టీని చావు దెబ్బ కొట్టాడు. గెలుపు మార్జిన్‌కంటే నోటాకు అత్యధికంగా 1,550 ఓట్లు రావటం విశేషం.

బినా (ఎస్సీ): బీజేపీ 460 ఓట్ల తేడాతో కాంగ్రెస్‌ను ఓడించింది. ఇక్కడ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా 1,563 ఓట్లు సాధించి గెలుపు ఓటములను శాసించింది.

మైహర్: కాంగ్రెస్‌పై బీజేపీ 2,984 ఓట్ల తేడాతో గెలిచింది. ఇక్కడ కాంగ్రెస్ అవకాశాలకు గండి కొడుతూ జీజీపీ ఏకంగా 33,397 ఓట్లు సాధించింది.

టిమర్ని (ఎస్టీ): ఇక్కడ 2,213 ఓట్ల తేడాతో కాంగ్రెస్‌పై బీజేపీ గెలిచింది. జీజీపీ 4,722 ఓట్లు సాధించి కాంగ్రెస్ ఓటమికి కారణమైంది.

దేవ్‌తలాబ్: బీఎస్పీపై బీజేపీ 1,080 ఓట్ల తేడాతో గెలిచింది. సమాజ్‌వాదీ పార్టీ ఇక్కడ 2,213 ఓట్లు సాధించి బీఎస్పీ ఓటమికి కారణమైంది.

రాజ్‌పూర్ (ఎస్టీ): బీజేపీపై కాంగ్రెస్ అభ్యర్థి 932 ఓట్ల తేడాతో గెలిచారు. ఇక్కడ సీపీఐ 2,411 ఓట్లు, ఆప్ 1,510 ఓట్లు సాధించి బీజేపీ ఓటమికి కారణమయ్యాయి.

డబ్బులిచ్చినా టికెట్ ఇవ్వలేదు

రాజస్థాన్ బీజేపీ నేత ఆరోపణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): తాము డబ్బులిచ్చినా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వడం లేదని రాజస్థాన్‌లో కొందరు బీజేపీ నాయకులు మీడియాకెక్కుతున్నారు. తాజాగా ఫతేహ్‌పూర్ టికెట్ ఆశించిన ఆనంద్ హుడ్డా మాట్లాడుతూ ఏడెనిమిది నెలల క్రితమే తనకు టికెట్ ఇవ్వడానికి బీజేపీ పెద్దలతో డీల్ కుదిరిందని.. రూ.2 కోట్లు ఇవ్వాలని అడిగారని తెలిపారు. భరత్‌పూర్‌కు చెందిన బీజేపీ ఇన్‌చార్జి సోమకాంత్ శర్మ, బీజేపీ కార్యదర్శి చంద్రశేఖర్, మరో నేత రాజ చౌదరిలకు తాను రూ.50 లక్షల నగదు ఇచ్చానని చెప్పారు. అయినా తనకు టికెట్ ఇవ్వలేదన్నారు.

8 మందితో జనహిత పార్టీ మొదటి లిస్టు

ఇండోర్: ఆర్ఎస్ఎస్ మాజీ ప్రచారక్ అభయ్ జైన్ స్థాపించిన జనహిత పార్టీ మధ్యప్రదేశ్ అసెంబ్లీకి పోటీ చేసే 8 మంది అభ్యర్థుల లిస్టును శుక్రవారం విడుదల చేసింది. కొత్తగా ఏర్పడిన తమ పార్టీకి ఇంకా గుర్తు కేటాయించనందున తమ వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తారని అభయ్ జైన్ తెలిపారు. తన పార్టీలో తనతో సహా ఆరుగురు మాజీ ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌లు ఉన్నారన్నారు.

భారతీయుడికి రూ. 16 కోట్ల జాక్‌పాట్

దుబాయ్: తమిళనాడుకు చెందిన మాగేశ్ కుమార్ నటరాజన్‌ను శుక్రవారం అదృష్టదేవత వరించింది. ఎమిరేట్స్ డ్రాలో ఫాస్ట్5 గ్రాండ్ ప్రైజ్ పొందారు. ఈ జాక్‌పాట్ కొట్టిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందని మొదటి వ్యక్తిగా ఆయన నిలిచారు. బహుమతి కింద ఆయనకు రానున్న 25 ఏండ్ల పాటు ప్రతి నెలా దాదాపు రూ.5.6 లక్షలు లభించబోతున్నది. తమిళనాడులోని అంబూరులో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఆయన 2019 నుంచి నాలుగేళ్ల పాటు సౌదీ అరేబియాలో పని చేయడానికి వెళ్లారు. లాటరీలపై ఆసక్తి ఏర్పడటంతో టికెట్లు కొనేవారు. భారీ బహుమతి లభించిన తర్వాత నటరాజన్ మాట్లాడుతూ, తాను బాల్యం నుంచి చాలా కష్టాలు అనుభవించానని, ఈ సొమ్ముతో తన కుటుంబానికి మంచి భవిష్యత్తు ఇవ్వడంతోపాటు, సమాజంలో అవసరమైనవారికి తన వంతు సహాయం చేస్తానని తెలిపారు.

2 నిమిషాల సుఖం కోసం లొంగిపోతే మీకే నష్టం

- *లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలి*
- *యుక్త వయస్కులకు కలకత్తా కోర్టు సూచన*

కోల్‌కతా, అక్టోబర్ 20: పోక్సో కేసులో కలకత్తా హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. లైంగిక కోరికలను నియంత్రించుకోవాలని యుక్త వయస్కులకు సూచించింది. ముఖ్యంగా యువతులు 2 నిమిషాల సుఖం కోసం లొంగిపోవద్దని పేర్కొన్నది. ఇది సమాజంలో ఆమె గౌరవాన్ని తగ్గిస్తుందని, చెడ్డపేరు తెస్తుందని పేర్కొన్నది. పరస్పర అంగీకారంతో సెక్స్‌లో పాల్గొనే కేసుల్లో పోక్సో చట్టాన్ని ప్రయోగించే అంశంపై ఆందోళన వ్యక్తంచేస్తూ కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. మైనర్ అయిన తన భార్యతో శారీరక సంబంధంలో పాల్గొన్న ఓ వ్యక్తికి సెషన్స్ కోర్టు 20 ఏండ్ల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పుపై యువకుడు కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా.. దీనిపై జస్టిస్ చిత్తరంజన్ దాస్, జస్టిస్ పార్థసారథిసేన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తన ఇష్టపూర్వకంగానే సంబంధం పెట్టుకున్నానని సదరు బాలిక కోర్టుకు తెలిపింది. అనంతరం అతడిని పెండ్లి చేసుకొన్నట్టు చెప్పింది. 18 ఏండ్లలోపు పెండ్లి చేసుకోవడం చట్ట విరుద్ధమని ఆమె కోర్టు ఎదుట ఒప్పుకొన్నది. దీంతో ఈ కేసులో నిందితుడిని కలకత్తా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఈ సందర్భంగా యువతీయువకులకు ధర్మాసనం పలు సూచనలు జారీ చేసింది. బాలికలకు వ్యక్తిత్వం, ఆత్మగౌరవం అన్నింటికంటే ముఖ్యమని సూచించింది. అలాగే, అమ్మాయిలను అబ్బాయిలు గౌరవించాలని పేర్కొన్నది. వారి హక్కులు, గోప్యతను కాపాడాలని సూచించింది. ఈ విషయంలో తల్లిదండ్రులే మొదటి గురువుగా ఉండాలని, పిల్లలకు మంచిచెడులు చెప్పాలని తెలిపింది.

ప్రెగ్నెన్సీలో బరువు పెరిగితే గుండె జబ్బులు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: ప్రెగ్నెన్సీ సమయంలో విపరీతంగా బరువు పెరిగితే.. తదనంతర కాలంలో ఆ మహిళ మధుమేహం, గుండెజబ్బులతో మరణించే ప్రమాదం ఎక్కువని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. పెన్సిల్వేనియా వర్సిటీ పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. లాన్సెట్ జర్నల్‌లో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం, అమెరికాలో 45 వేల మంది మహిళలకు సంబంధించిన 50 ఏండ్ల డాటాను సైంటిస్టులు విశ్లేషించారు. ప్రెగ్నెన్సీ సమయంలో అనూహ్యంగా అధిక బరువు పెరిగినవారికి తదనంతర కాలంలో గుండెపోటు, మధుమేహం తలెత్తుతున్నట్టు వారు గుర్తించారు. అమెరికా సీడీసీ మార్గదర్శకాల ప్రకారం.. తక్కువ బరువున్న మహిళ ప్రెగ్నెన్సీ సమయంలో 12.5 నుంచి 18 కిలోల వరకు, ఊబకాయంతో ఉంటే 5 నుంచి 10 కిలోల వరకు బరువు పెరగవచ్చు. బరువు అదుపులో ఉంటే తల్లికి, నవజాత శిశువుకు ఇద్దరికీ మేలని పరిశోధకులు తెలిపారు.